THE HEART AND SOUL OF ANDHRA PRADESH

Monday , March 16, 2009.



# రైతులోకానికి 'మొండిచెయ్యే'

పి.వి. సుబ్బయ్యచౌదరి

యు.పి.ఎ. ప్రభుత్వం అయిదేళ్లలో రైతులకు ఎన్నో హామీలిచ్చింది. బడ్జెట్లలో పలు పథకాలు, కార్యక్రమాలు ప్రకటించింది. ఆచరణలో అవన్నీ ఘోరంగా విఫలమయ్యాయి. రైతులతో ప్రభుత్వం రాజకీయాలు చేసిందని రూఢీ అయింది. వాస్తవాన్ని గ్రహించిన రైతులోకం శంఖారావం పూరిస్తోంది. నేటినుంచి దేశవ్యాప్తంగా ఉద్యమబాట పట్టనున్న రైతులు, తమకు బాసటగా నిలిచేవారికే పట్టం కట్టేది ఖాయం.



## 'పథకం' ప్రకారం వంచన

కేంద్ర ఆర్థికమంత్రి మొన్న ఫిబ్రవరి 16న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతూ- రైతులను వీరులుగా అభివర్ణించారు. 'భారతదేశ విజయగాథలో అసలైన వీరులు రైతులే. వారు కష్టపడి పని చేయడం వల్లే దేశానికి ఆహార భద్రత చేకూరింది. 2008లో ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం రికార్డుస్థాయిలో 2.27కోట్ల టన్నుల గోధుమ, 2.85కోట్ల టన్నుల బియ్యం సేకరించడంలో మన ధాన్యాగారాలు నిండుగా కలకలలాడుతున్నాయి. ఈ నాలుగేళ్లలో వ్యవసాయ వార్షిక వృద్ధిరేటు 3.7 శాతానికి పెరిగింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా కోటి టన్నుల చొప్పున పెరిగి 2007-08లో ఇదివరకెన్నడూ లేనంత ఎక్కువగా 23కోట్ల టన్నులకు చేరుకుంది' అని ఆయన అన్నారు. మాటలు కోటలు దాటినా ఆయన చేతలు మాత్రం గడపదాటలేదు. రైతులను ఆకాశానికి ఎత్తిన ఆయన, వ్యవసాయరంగానికి తగినన్ని నిధులు కేటాయించడంలో మాత్రం విఫలమయ్యారు. వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రతిపాదిత పెరుగుదల కేవలం 1.6శాతం మాత్రమే. వచ్చే ఏడాది ధరల పెరుగుదల అంచనా సైతం లెక్కవేయలేదు. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే బడ్జెట్లో వ్యవసాయానికి జరిపిన వాస్తవ కేటాయింపులు ఈ ఏడాదికన్నా తక్కువే. కేంద్రప్రభుత్వం 2008-09 బడ్జెట్లో రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేకపోయింది. 2009-10 బడ్జెట్లో అంతంతమాత్రం కేటాయింపులే చేసింది. ఈ విషయంలో రైతులను చైతన్యవంతులు చేయడానికి తగిన సందర్భం ఇదే.

## ఆచరణకు ఆమడదూరం

కేంద్ర ఆర్థికమంత్రి 2008-09 బడ్జెట్ సమర్పిస్తూ- ఆ ఏడాది రూ.2,80,000 కోట్ల లక్ష్యాన్ని ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. ఈ హామీ అమలు పరిస్థితి గురించి 2009-10 బడ్జెట్‌లో నివేదించారు. ఖరీఫ్, రబీ సీజను ఉచ్ఛస్థాయిలో ఉండే ఎనిమిది నెలల కాలంలో సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్.ఆర్.బి.), వాణిజ్య బ్యాంకులు సహా అన్ని బ్యాంకులు కలపి కేవలం రూ.1,36,586.52కోట్ల లక్ష్యం మాత్రమే సాధించగలిగినట్లు అందులో తెలిపారు. అత్యంత నిరాశ కలిగిస్తున్న విషయమిది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పి.ఎ.సి.ఎస్.) ఆర్థిక మూలాల్ని పటిష్ఠం చేయడానికి ప్రొఫెసర్ వైద్యనాథన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు నిధులు విడుదల చేసినప్పటికీ, వాటిని ఆ సంఘాలకు అందజేయలేదు. వ్యవసాయ రుణ విముక్తి పథకం 2008కింద కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు తగినంత నగదు అందుబాటులో లేక అల్లాడిపోయాయి. పర్యవసానంగా రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. అత్యధిక వడ్డీలకు రుణాలు తీసుకోవలసివచ్చింది. ఈ గందరగోళానికంతటికీ భారత ప్రభుత్వానిదే బాధ్యత.

పాతికవేల రూపాయలలోపు వ్యవసాయ రుణాలవాటా 1985లో 49.60శాతం ఉండగా, 2007నాటికి అది 11.7శాతానికి తగ్గిపోయింది. 2006లో కోటీ78లక్షల రుణ ఖాతాల కింద రూ.22,979కోట్ల మేరకుచిన్న రుణాలు అందజేయగా, 7,300 ఖాతాల కింద రూ.50,969కోట్ల మేరకు పెద్ద రుణాలు బట్వాడా చేశారు. చిన్న, సన్నకారు రైతుల పట్ల ప్రభుత్వ నిరాదరణకు నిదర్శనమిది. త్వరిత సాగునీటి ప్రయోజన కార్యక్రమం విషయంలోనూ ప్రభుత్వం మాట తప్పింది. 2008-09 బడ్జెట్‌లో తెలియజేసిన దానిప్రకారం- 2007-08లో ఈ పద్దుకింద రూ.11,000కోట్లు కేటాయించారు. అందులో గ్రాంటు మొత్తం రూ.3,580కోట్లు. 2008-09లో ఈ ప్రణాళిక పరిమాణం అంచనాను రూ.20,000కోట్లకు పెంచారు. అందులో గ్రాంటు మొత్తం రూ.5,550కోట్లు. అమలు నివేదిక ప్రకారం- రెండోసారి అదనపు పద్దుల రూపేణా సమకూర్చిన అదనపు నిధులను కలుపుకొని ఈ కార్యక్రమం కోసం ఆ ఏడాది రూ.6,600కోట్లు అందజేశారు. 2008 డిసెంబరు 31వరకు ఎ.ఐ.బి.పి. కింద రూ.4,122.97కోట్ల మేరకు గ్రాంటు విడుదల చేశారు. హామీ ఇచ్చిన మేరకు నిధులు అందజేయడంలో ప్రభుత్వం విఫలమైంది. దాంతో, అదనపు భూభాగాన్ని సాగులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన సాగునీటి పథకాలు పూర్తికాని పరిస్థితి ఏర్పడింది. 2008-09లో రూ.348కోట్లతో వర్షాధార ప్రాంత అభివృద్ధి కార్యక్రమాన్ని ఖరారుచేసి, అమలు చేస్తామన్నది మరో హామీ. వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం పొందని ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తామనీ తెలిపారు. కానీ, కేవలం అయిదుకోట్ల రూపాయలు మాత్రమే సమకూర్చారని, ఆ డబ్బునూ ఖర్చుచేయలేదని 2009-10 బడ్జెట్ అమలు నివేదిక తెలియజేసింది. రైతుల ఆర్థిక స్థితిగతులను నేరుగా ప్రభావితంచేసే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రైతులను వీరులుగా పొగిడినప్పటికీ, తమ దృష్టిలో వారికి ఏమాత్రం విలువలేదని ఈ చర్య ద్వారా ప్రభుత్వం చాటుకొంది. సూక్ష్మ సేద్యం విషయంలోనే ఇదే వరస. మరో నాలుగు లక్షల హెక్టార్లను సాగులోకి తెచ్చే ఉద్దేశంతో 2008-09లో సూక్ష్మ సాగునీటి పథకానికి రూ.500కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. 2009-10 బడ్జెట్ అమలు నివేదికనుబట్టి 2008 డిసెంబరు వరకు ఈ పథకం కోసం 11 రాష్ట్రాలకు కేటాయించిన మొత్తం రూ.321.60కోట్లే. పదకొండో ప్రణాళిక కాలంలో ప్రభుత్వ సహాయంతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 500 భూసార పరీక్ష ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తామని, ఒక్కో ప్రయోగశాల ఏర్పాటుకు రూ.30లక్షలు వ్యయమవుతుందని 2008-09 బడ్జెట్‌లో తెలిపారు. 2009 మార్చిలోగా దేశంలోని 250 జిల్లాలకూ జిల్లాకొకటి చొప్పున పూర్తిస్థాయి సంచార భూసార పరీక్ష ప్రయోగశాలలను సమకూరుస్తామని, అందుకోసం వ్యవసాయ మంత్రిత్వశాఖకు ఏకమొత్తంలో రూ.75కోట్లు కేటాయిస్తున్నామనీ వెల్లడించారు. కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నీరుగార్చడంతో పాటు దారి మళ్లించింది. జాతీయ సమతుల ఎరువుల వినియోగపథకం పేరుతో కొత్తగా రూపొందించిన పథకానికి జాతీయ భూసార పరిరక్షణ, ఫలదీకరణ పథకంగా పేరు మార్చామని, దీన్ని ప్రభుత్వం 2008 జూన్‌లో ఆమోదించిందనీ అమలు నివేదికలో తెలిపారు. నివేదిక ప్రకారం- ఈ పథకానికి 2008 ఆగస్టులో పాలనపరమైన ఆమోదం లభించింది. పథకం అమలుకోసం దీని మార్గదర్శకాలు అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపారు. 2008-09లో వినియోగంకోసం బడ్జెట్‌లో కేటాయించిన రూ.19.98కోట్లను, ఈ ఏడాది వినియోగించుకోనున్నట్లు అమలు నివేదికలో తెలియజేశారు. ఇంత ముఖ్యమైన కార్యక్రమం కోసం కేటాయించిన నిధులను ఖర్చు చేయకపోవ

డమే కాకుండా, ఈ కార్యక్రమాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. ఫలితంగా- భూసారం మరింత క్షీణించి, వివిధ వ్యవసాయోత్పత్తులపై నేరుగా దుష్ప్రభావం పడింది.

సహకారసంఘాలు వ్యవసాయ రుణావసరాలను చాలావరకు తీరుస్తున్నాయి. అవి సహకారం నిరాకరిస్తే రుణప్రవాహం ఆగిపోయి రైతులు తీవ్ర కష్టనష్టాలపాలపడతారు. చౌదరి బ్రహ్మప్రకాశ్, జగదీశ్ కపూర్, విఖేపాటిల్, వి.ఎస్.వ్యాస్ సారథ్యం వహించిన వివిధ కమిటీలు సహకార సంస్థల పటిష్ఠీకరణకు పలు సిఫార్సులు చేశాయి. వాటిని అమలుచేయడంలో కేంద్రప్రభుత్వం అలక్ష్యం వల్ల సహకార సంస్థలు సంక్షోభంలో చిక్కుకొని, వ్యవసాయ రుణావసరాలు తీర్చలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో- సహకార పరపతి వ్యవస్థ, పునరుద్ధరణకు సిఫార్సులు చేస్తూ ప్రొఫెసర్ వైద్యనాథన్ 2004లో నివేదిక సమర్పించారు. రూ.14,839కోట్ల ఆర్థిక సహాయం అందజేసి ఈ వ్యవస్థను ఆదుకోవాలని ఆయన సూచించారు. ఆయన సిఫార్సు ప్రకారం- అందులో 53శాతం కేంద్రప్రభుత్వం గ్రాంటుగా ఇవ్వాలి. 31శాతం డబ్బును కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి సరళరుణంగా అందజేయాలి. 16శాతం నిధుల్ని కేంద్రప్రభుత్వం సహకార పరపతి వ్యవస్థ (సి.సి.ఎస్.)కు సమకూర్చాలి. ఈ పథకాన్ని అనుసరించి సహకారసంస్థలకు రూ.14,839కోట్లు అందజేయవలసి ఉండగా, అయిదేళ్లలో ఇందుకోసం జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్)కు విడుదల చేసింది రూ.4,970.37కోట్లేనని 2009-10 బడ్జెట్‌లోని అమలు నివేదికలో తెలిపారు. నాబార్డుకు విడుదల చేస్తున్న నిధులనూ ఏదో ఒక సాకుతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పూర్తిగా అందజేయడంలేదు. స్వల్పకాలిక రుణపథకం అమలు విషయంలో కేంద్రప్రభుత్వం ఘోరంగా విఫలమైందని భావిస్తున్న రైతులు, ఈ దశకంలో దీర్ఘకాలిక రుణ పథకం అమలుకాగలదన్న ఆశలూ పెట్టుకోవడంలేదు. రైతుల రుణమాఫీ పథకం అమలు విషయంలోనూ తిరకాసే. 3,68,77,818మంది రైతులకు రూ. 65,318.33 కోట్లమేరకు రుణాలు మాఫీ చేసినట్లు 2008-10 బడ్జెట్‌లోని అమలు నివేదికలో తెలిపారు. రుణాలు ఇచ్చిన సంస్థలకు మొదటికిస్తు తిరిగి చెల్లింపు కోసం భారత రిజర్వు బ్యాంకు (ఆర్.బి.ఐ.)కి రూ.25,000కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఆయా బ్యాంకులకు ఖరీఫ్, రబీ సీజన్లకు ముందు డబ్బు అందలేదు. దాంతో వ్యవసాయ పరపతి సంస్థల వద్ద డబ్బులేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా అవి రైతులకు రుణాలు అందజేసి, లక్ష్యాలు సాధించలేకపోయాయి.

## నిలువెల్లా నిర్లక్ష్యం

ఆకలిని, పేదరికాన్ని తగ్గించాలి. గ్రామీణుల జీవన స్థితిగతులను, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలి. సామాజికంగా సమతుల్యమైన; పర్యావరణ, ఆర్థికపరంగా సుస్థిరమైన అభివృద్ధి సాధించాలి. పదకొండో పంచవర్ష ప్రణాళికలో సాధించతలపెట్టిన సమ్మిళితవృద్ధి లక్ష్యమిది. ఈ లక్ష్యాల సాధనకోసమంటూ కొన్ని కార్యక్రమాలు, పథకాలు రూపొందించారు. కానీ ఎంతో కీలకమైన వ్యవసాయ రంగానికి అంతంతమాత్రం నిధులు కేటాయించారు. పార్లమెంటులో ఇచ్చిన హామీలను అమలుపరచకపోవడం చాలా తీవ్రమైన విషయం. పార్లమెంటు సభ్యులు వ్యవసాయ రంగంపై శ్రద్ధచూపడంలేదని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. మన పార్లమెంటు సభ్యుల్లో అత్యధికులు గ్రామీణ, వ్యవసాయ నేపథ్యం కలిగినవారే. అయినప్పటికీ రైతులను వారు విస్మరించడం విస్మయకరం. ఎన్నికల్లో పోటీచేసినప్పుడు పెద్దపెద్ద హామీలు ఇచ్చే నాయకులు, తరవాత వాటన్నింటినీ మరిచిపోతున్నారు. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడంలేదు. ఈ వాస్తవాన్ని రైతులు గుర్తించారు. విధాన నిర్ణేతలు, ఉన్నతాధికారుల్లో జవాబుదారీతనం లోపించిందని, బాధ్యతరాహిత్యం పెరిగిపోయిందని భావిస్తున్నారు. వ్యవసాయరంగానికి రాజకీయ పార్టీలు, నాయకులు చేసిన అన్యాయానికి వ్యతిరేకంగా ఈ ఎన్నికల సందర్భంగా ఎలుగెత్తేందుకు వారు సిద్ధపడుతున్నారు. వ్యవసాయరంగం డిమాండ్లను తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చి, వాటి అమలుకు కట్టుబడి ఉంటామన్న నమ్మకం కలిగించే రాజకీయపక్షానికే మద్దతు పలకబోతున్నారు. ప్రజానీకాన్ని, ముఖ్యంగా రైతులోకాన్ని జాగృతపరచడానికి రైతులు, రైతుసంఘాలు ఈనెల 16నుంచి దేశవ్యాప్తంగా 'శంఖారావం' పూరించబోతున్నారు. ఎన్నికలయ్యే వరకు వివిధ రాష్ట్రాల్లో విభిన్న పద్ధతుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టబోతున్నారు. దగాచేస్తున్న పాలకగణంపై ఇది దండయాత్ర!

**(రచయిత భారతీయ రైతు సంఘాల సమాఖ్య సలహాదారు)**